నియోజకవర్గ సమస్యలపై సమీక్ష



జెడ్సీ అపూర్వ చౌహాన్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

ఆల్విన్‌కాలనీ: జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను సోమవారం కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. హైదర్‌నగర్, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్‌లలోని కాలనీ, బస్తీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన కోరారు.

జెడ్సీని కలిసిన కార్పొరేటర్

జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు కలిసి పలు సమస్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. చేయాల్సిన పనులపై వినతిపత్రం అందజేశారు.

చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి



చెత్తా చెదారాన్ని తొలగింపజేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: వర్షాకాలం దృష్ట్యా చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడూ తొలగించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని విద్యుత్ ఆఫీస్ వీధిలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెత్త వల్ల దుర్వాసన, దుర్గంధంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దోమల బెడద నివారణకు శానిటేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. పరిసర ప్రాంత ప్రజలు చెత్తా చెదారాన్ని ఆటో రిక్షా కార్మికులకు అందజేయాలని కోరారు.

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కుంచపు కవిత

మోతీనగర్: రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ వడ్డెర సంఘం మేడ్చల్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి కుంచపు కవిత డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలమల్లు ఆధ్వర్యంలో సోమవారం ఇందిరా పార్కు వద్ద ఒక్క రోజు దీక్ష చేపట్టారు. కార్యక్రమానికి అల్లాపూర్ డివిజన్ నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో.. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చి ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్ సమస్యలు పరిష్కరిస్తా



డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. వర్షాకాలంలో డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న సందర్భంగా వినాయక్‌నగర్‌లో సోమవారం పర్యటించారు. భైరవ స్వామి గుడి వద్ద డ్రైనేజీ లైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి బస్తీ, కాలనీల్లో వర్షాకాలంలో ఏర్పడే సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ మహ్మద్ రషీద్, వాటర్ వర్క్స్ సిబ్బంది, స్థానికులు సురేందర్ యాదవ్, ఎస్‌వీ. రత్నం, మహేష్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మూసాపేట: ఎన్నికల సమయంలో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బాలానగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ అసెంబ్లీ కో కన్వీనర్ సతీష్ కుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వర రావు, నాగరాజు, నాయకులు సతీష్ చారి, మల్లేష్‌గౌడ్, మనోహర్, యాదన్న, తులసి తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఆలయ కమిటీతో పట్నం సునీత తదితరులు

మూసాపేట: మూసాపేట నల్ల పోచమ్మతల్లి ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, వైస్ చైర్మన్ తూము సుధాకర్, సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా కె. నర్సింగ్ రావు, ఎస్. స్వరూప, ఎం. సత్యనారాయణ, డి. శ్రీనివాస్‌రెడ్డి, ఎక్స్ అఫీషియో మెంబర్ పంతులు గురు రాజుతో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ డి. మధుబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అరుణకుమారి, కాంగ్రెస్ నాయకులు పట్నం సునీత, హరివర్ధన్, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జలమయం.. అయోమయం

- చెరువును తలపించేలా హైటెన్షన్ లైన్ రోడ్డు
- నిలిచిన వర్షపు నీటితో వాహనదారులకు తిప్పలు
- ఇప్పటికే గుంతల రోడ్డుతో ఇబ్బందులు
- ఇటీవలే పాఠశాలకు వెళ్తూ గాయపడ్డ ఓ విద్యార్థి



ఆల్విన్‌కాలనీ: కురుస్తున్న వర్షాలతో రోడ్లు జలమయంగా మారాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే రోడ్లు గుంతలమయంగా ఉండటంతో వాటిలో నీరు నిలిచి ప్రమాదకరంగా మారాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పాపారాయుడు నగర్ నుంచి కూకట్‌పల్లి ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న హైటెన్షన్ లైన్ రహదారిలో ప్రయాణం అంటేనే ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ రహదారి నిర్మించి కొద్ది రోజులు కూడా గడవక ముందే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సుమారు మూడు అడుగుల లోతులో నీరు నిలవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఈ రహదారిలో వర్షపు నీరు ఎటు వైపు కూడా వెళ్లడానికి సరైన మార్గం లేదు. దీంతో ప్రధాన రహదారిలోనే డివైడర్‌కు ఇరువైపులా వర్షపు నీరు నిలిచి గుంతలు ఏర్పడ్డాయి. కూకట్‌పల్లి ప్రధాన రహదారిలోని మెట్రోకు వెళ్లే ఈ రహదారిలో సుమారు కిలోమీటర్ మేర ఇలాంటి పరిస్థితి ఉంది. చిన్న వర్షాలకే ఈ పరిస్థితి ఉంటే పెద్ద వర్షం వస్తే ఎలా ఉంటుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గుంతలు ఏర్పడి వర్షపు నీటితో కూకట్‌పల్లి పాపారాయుడు నగర్ హైటెన్షన్ రహదారి

వందల సంఖ్యలో రాకపోకలు

ప్రతి రోజు విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు కుత్బుల్లాపూర్ సర్కిల్ నుంచి కూకట్‌పల్లి ప్రాంతానికి వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. గుంతల రోడ్లతో నడుం నొప్పులు, మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు రోజుల క్రితం పాఠశాలకు ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న విద్యార్థి ఈ గుంతల్లో పడి ప్రమాదానికి గురయ్యాడని స్థానికులు తెలిపారు. ఈ రహదారిపై గుంతలను సరిచేసి వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కృష్ణారావు



కూకట్‌పల్లి: బాలాజీనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ అధ్యక్షుడు, హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకట్‌రావుకు సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాలాజీనగర్ మార్వెల్ అపార్ట్‌మెంట్‌లో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, నాయకులు ప్రభాకర్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ చైర్మన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మువ్వ విజయ్‌బాబుని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ సోమవారం కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.



మీసేవ నిర్వాహకుడికి మొట్టికాయ

- రూ.50 అదనంగా వసూలు చేసిన నిర్వాహకుడు
- రూ.1550 చెల్లించాలని కమిషన్ ఆదేశం

నిర్ణీత ఫీజు కన్నా ఎక్కువ వసూలు చేసే మీసేవ నిర్వాహకులకు ఇదో చెంపపెట్టు లాంటి తీర్పు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కన్నా ఎక్కువ వసూలు చేసిన ఓ మీసేవ కేంద్రం నిర్వాహకుడిపై పట్టువదలని విక్రమార్కుడిలా ఓ వినియోగదారుడు విజయం సాధించారు.

సిటీ, కోర్టులు: వినియోగదారుడి నుంచి రూ.50 అదనంగా వసూలు చేసిన మీసేవ నిర్వాహకుడికి హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. నిర్ణీత రుసుము కన్నా ఎక్కువ మొత్తం వసూలు చేయడం సేవా లోపంతో పాటు అనైతిక వ్యాపారమని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. కూకట్‌పల్లికి చెందిన పి.నరేష్ తన ద్విచక్ర వాహనం రిజిస్ట్రేషన్ బదిలీ కోసం స్లాట్ బుక్ చేయాలని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన సాయి నందిని మీ సేవ సెంటర్ నిర్వాహకుడిని కోరారు. రవాణా శాఖకు రూ.585 ఫీజు, సర్వీస్ చార్జ్‌గా రూ.35 కలిపి మొత్తం రూ. 620 అవుతుందని, అదనంగా రూ.50 కలిపి రూ.670 చెల్లించాలని మీసేవ నిర్వాహకుడు కోరారు. సర్వీస్ చార్జ్ రూ.35 చెల్లిస్తున్నా రూ.50 అదనంగా ఎందుకు చెల్లించాలని నరేష్ ప్రశ్నించారు. అయినప్పటికీ గత్యంతరం లేక చెల్లించక తప్పలేదు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మీసేవ నిర్వాహకుడు రూ.50 అదనంగా వసూలు చేశాడని నరేష్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. వినియోగదారుడి నుంచి అదనంగా వసూలు చేసిన రూ.50 తిరిగి ఇవ్వాలని, అలాగే పరిహారంగా రూ.1000, కోర్టు ఖర్చులకు మరో రూ.500 ఇవ్వాలని కమిషన్ మీ సేవ కేంద్రం నిర్వాహకుడికి ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్-3 కమిషన్ అధ్యక్షుడు ఎం.రాంగోపాల్‌రెడ్డి, సభ్యులు ఆర్.నారాయణ రెడ్డితో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది.

ఫలహారం బండి ఊరేగింపు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ మహంకాళి నగర్‌లో ఫలహారం బండి ఊరేగింపు ఆదివారం రాత్రి జరిగింది. నల్లపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి తొట్టెల ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్, రాష్ట్ర నాయకులు దయాకర్, డివిజన్ నాయకులు ప్రవీణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



ఆల్విన్‌కాలనీ: కమలమ్మ కాలనీ, చంద్రమ్మ కాలనీల్లో బోనాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, ఏడుపాయల శ్రీనివాస్, సంతోష్ బిరాదర్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎరుకలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రవికుమార్

ఓల్డ్ బోయిన్‌పల్లి: జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఎరుకలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, ఏకలవ్య కార్పొరేషన్ బడ్జెట్‌ను ఆమోదించాలని తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు లోకిని రాజు, కుతాడి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమకు ప్రత్యేక బడ్జెట్ కింద రూ.1000 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఏకలవ్య కార్పొరేషన్ చైర్మన్‌గా విద్యావంతులు, మేధావులు, అనుభవజ్ఞులైన వారికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఉద్యోగస్తుల ప్రమోషన్‌లో తమకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో కేతిరి రాజశేఖర్, కూరాకుల శ్రీనివాస్, పాతపల్లి నర్సింహ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు లోకిని రాజు, రవికుమార్

అడిషనల్ కలెక్టర్‌గా రాధికాగుప్తా బాధ్యతల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)గా రాధికాగుప్తా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2021వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాధికాగుప్తా హన్మకొండ జిల్లా అడిషన్ కలెక్టర్ (లోకల్ బాడీస్)గా పని చేశారు. ఇక్కడ అడిషనల్ కలెక్టర్‌గా పని చేసిన అభిషేక్ ఆగస్త్య ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెల్సిందే. ఆయన స్థానంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్)గా రాధికాగుప్తా మేడ్చల్ జిల్లాకు బదిలీపై వచ్చారు. దీనికి ముందు ఆమె మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆ తర్వాత జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్(లోకల్‌బాడీస్)గా ఉన్న విజయేందర్‌రెడ్డి నుంచి రాధికాగుప్తా చార్జ్ తీసుకున్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాను మార్యాదపూర్వకంగా డీఆర్‌ఓ హరిప్రియ, కలెక్టరేట్ ఏఓ రాంమోహన్, వివిధ శాఖల జిల్లా అధికారులు కృష్ణారెడ్డి, పూర్ణిమా, విజయకుమారి, రాజేందర్, పద్మ, సైదులు కలిశారు.

ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక సాయం

సాక్షి, సిటీబ్యూరో: ట్రాన్స్‌జెండర్లకు ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీం కింద రూ. 5 లక్షల సాయాన్ని జిల్లా కలెక్టర్ గౌతమ్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో 10 మంది ట్రాన్స్‌జెండర్లకు రూ. 50 వేల చొప్పున చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ట్రాన్స్‌జెండర్ సంక్షేమంలో భాగంగా గతంలో కూడా అర్హులైన 11 మందికి ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున 5.50 లక్షలు అందజేసినట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. 100 శాతం సబ్సిడీతో వారికి ఈ చేయూతను అందించటం ద్వారా ఉపాధికి తోడ్పాటు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మరో 26 మంది ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డులు అందజేశామన్నారు. ఈ కార్డులు ఇళ్ల మంజూరుకు దోహదపడతాయన్నారు. జిల్లాలోని చైల్డ్ కేర్ సంస్థల్లోని అనాథలైన చిన్నారులకు క్యాస్ట్, బర్త్ సర్టిఫికెట్‌లను కూడా ఈ సందర్భంగా పంపిణీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, బాల రక్షక కో ఆర్డినేటర్ నాగమణి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.డి.ఇంతియాజ్ రహీం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



అధికారులతో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

బాలానగర్: ఎస్‌టీపీ వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. ఫతేనగర్ డివిజన్‌లోని ఎల్‌బీఎస్ నగర్‌లోని ఎస్‌టీపీ వాటర్ ప్లాంట్ చివరి దశ పనులను సోమవారం పరిశీలించారు. ఈ నెల చివరి వారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

విద్యార్థుల్లో విజ్ఞానం వికసించేలా...

ప్రభుత్వ బడుల్లో 'శిక్ష సప్తాహ'

సాక్షి, సిటీబ్యూరో: నూతన జాతీయ విద్యావిధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి 'శిక్షా సప్తాహ' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ ఉత్తర్వుల మేరకు... ఈ నెల 30 వరకు రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. విద్యార్థులు సర్వతోభివృద్ధి చెందేలా ఒక్కోరోజు ఒక్కో ప్రత్యేకాంశంపై కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి హెచ్‌ఎంలు, సంబంధిత విద్యాధికారులను ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులు, సమాజంలోని ప్రభావ వర్గాలను ఇందులో భాగస్వాములయ్యేలా చర్యలు చేపడుతున్నారు.

విద్యార్థుల స్థాయిని బట్టి...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 94,790 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. దానికి అనుగుణంగా తరగతుల వారీగా విభజించారు. నిర్వహణకు సంబంధించి జియో ట్యాగింగ్‌తో కూడిన ఫొటోలు, వీడియోలను రోజువారీగా విద్యాంజలి పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలని అధికారులు సూచించారు.

డీఎంగా బాధ్యతల స్వీకరణ

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా డి. హరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్‌గా పనిచేసిన డి. హరి కూకట్‌పల్లి డిపోకు బదిలీ అయ్యారు. కూకట్‌పల్లి డిపో మేనేజర్‌గా పనిచేసిన ఇషాక్ బిన్ మహ్మద్ బదిలీపై మెదక్ కార్గో ఇన్‌చార్జిగా వెళ్లారు.

ప్రజావాణిలో 75 ఫిర్యాదులు

సత్వరమే పరిష్కరించాలన్న కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ప్రజావాణి కార్యక్రమంలో 75 దరఖాస్తుల(ఫిర్యాదులు)ను ఆయన స్వీకరించారు. ఇందులో పింఛన్లు, ధరణి, గృహజ్యోతి, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఉపాధి కల్పనకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. రైతు రుణమాఫీకి సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. పలువురు వికలాంగులు పింఛన్లు రావటంలేదని వినతి పత్రం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)రాధికాగుప్తా, డీఆర్‌ఓ హరిప్రియ, వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ నుంచి పలువురు అధికారుల బదిలీ

ఈ నెలాఖరు వరకు మరికొందరి బదిలీపై చర్చ

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ బదిలీల్లో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నుంచి నాలుగేళ్ల సర్వీస్ పూర్తయిన పలువురు జిల్లా అధికారులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలకు ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పెంచటంతో మరి కొందరు జిల్లా అధికారులు కూడా బదిలీ కావచ్చునన్న చర్చ స్థానికంగా సాగుతోంది.

జిల్లా పరిశ్రమల శాఖ జేడీ పడాల రవీందర్ భువనగిరి–యదాద్రి జిల్లాకు బదిలీ కాగా, ఈయన స్థానంలో సంగారెడ్డి జిల్లా నుంచి ప్రశాంత్‌కుమార్ బదిలీపై రానున్నారు. ఇదే శాఖలోని ఏడీ వెంకటేశ్వర్‌రావు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిర్మల సంగారెడ్డి బదిలీ కాగా, అక్కడ నుంచి రాధిక ఇక్కడికి బదిలీపై వచ్చి బాధ్యతలు కూడా స్వీకరించారు. జిల్లా పౌరసంబంధాల శాఖ అధికారి అరుంధతి భువనగిరి–యదాద్రి జిల్లాకు బదిలీ కాగా, ఏపీఆర్‌ఓ స్వర్ణలతకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. జిల్లా వైద్యశాఖలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేశ్వర్‌రావు సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. అదేవిధంగా సీపీఓ మోహన్‌రావు, ఇన్‌చార్జ్ డీటీఓ యాదయ్య, భూగర్భ జలశాఖ అధికారి రేవతితో పాటు నాలుగు ఏళ్ల పూర్తయిన పలువురు జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కూడా బదిలీ అవుతారనే చర్చ జోరుగా సాగుతోంది.

రెవెన్యూ శాఖలో...

ఇప్పటికే జిల్లా నుంచి రెవెన్యూ శాఖలో ఐదారుగురు తహసీల్దార్ స్థాయి అధికారులు రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలకు బదిలీ అయ్యారు. మరికొందరు రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు కూడా బదిలీ కావచ్చనే ప్రచారం జరుగుతోంది.

ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా చూడండి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ముదిరాజ్ మహాసభ నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు సోమవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. వాటిని శాసనమండలిలో ప్రస్తావించి అమలయ్యేలా చూడాలని ఆయనను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చినంగి వెంకటేశం ముదిరాజ్, నాయకులు సత్యనారాయణ, ఏంబరి ఆంజనేయులు, శ్రీనివాస్, అశోక్ కుమార్, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ చేయాలి



కలెక్టర్ గౌతమ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీని అర్హులైన వారందరికీ వర్తింపజేయాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సోమవారం ఆయన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రైతులందరికీ రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని చెప్పి, ఇప్పుడు నిబంధనలు, సాంకేతిక లోపం పేరుతో రైతులను మోసం చేస్తోందన్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో నాట్లు వేసే సమయంలో రుణమాఫీని నీరు గార్చాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పథకంలో లోపాలను ఎత్తిచూపుతూ అసెంబ్లీలో చర్చ పెట్టి కొత్త నిబంధనలను చేర్చడం చూస్తుంటే రైతుబంధు పథకాన్ని ప్రభుత్వం నీరుగార్చే విధంగా వ్యవహరిస్తుంది. రైతుబంధు పథకంలో మేడ్చల్ జిల్లాకు రూ.39 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉండగా కేవలం రూ. 11 కోట్లు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కో–ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్ మధు, నాయకులు చింతల దేవేందర్ యాదవ్, మహేష్ యాదవ్, మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు రైతులు ఉన్నారు.